A1TV NEWS

# ఆంధ్రప్రగతి


తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 67 బుధవారం - సెప్టెంబర్ 06 2023 పేజీలు 4. వేల :4 /

## సాంకేతిక కారణాలతోనే జీతాలు ఆలస్యమవుతున్నాయి

**-: మంత్రి బొత్స**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ కాన్వొకేషన్ హాలులో గురు పూజ్యోత్సవ కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి బొత్స పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్నాథ్ తదితరులు కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి బొత్స మాట్లాడుతూ, టీచర్లకు జీతాలు లేవని కొందరు విమర్శిస్తున్నారని, అయితే సాంకేతిక కారణాలతో జీతాలు ఆలస్యమవుతున్నాయని అన్నారు. ఈ నెల 7, లేదా 8 తేదీల్లో ఉపాధ్యాయుల ఖాతాల్లో జీతాలు జమ చేస్తామని పేర్కొన్నారు. నియామకాల గురించి



చెబుతూ, నెల రోజుల్లో అన్ని విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీ ప్రక్రియ చేపడతామని స్పష్టం చేశారు.

## చంద్రబాబు జైలుకు వెళ్లడం ఖాయం

**-: ఆదిమూలపు సురేశ్**



చంద్రబాబు దొంగ అనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. కోర్టులను మేనేజ్ చేసుకుంటూ ప్రతిసారి తప్పించుకుంటున్నారని విమర్శించారు. పూర్తి ఆధారాలతోనే ఐటీ అధికారులు చంద్రబాబుకు నోటీసులు ఇచ్చారని చెప్పారు. ఈసారి చంద్రబాబు అనే దొంగ దొరికిపోయారని, ముందు నుంచి తాము చెప్పుతున్నది నిజమనే విషయం ఇప్పుడు తేలిందని అన్నారు. ఈసారి చంద్రబాబు జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. ఐటీ నోటీసులపై చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తనకు కావాల్సిన వారికి అమరావతిలో కాంట్రాక్టులు ఇచ్చి కమీషన్ల రూపంలో వేల కోట్ల రూపాయలను చంద్రబాబు తీసుకున్నారని చెప్పారు. ఇందులో నారా లోకేశ్ పాత్ర కూడా స్పష్టంగా ఉందని అన్నారు.

## ఆర్టికల్ 370 రద్దు పిటిషన్లపై విచారణ పూర్తి..

### తీర్పు వాయిదా వేసిన సుప్రీంకోర్టు


- (ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ
- 16 రోజుల పాటు విచారణ జరిపిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం
- రాతపూర్వక వాదనలకు మరో మూడు రోజుల సమయం ఇచ్చిన ధర్మాసనం



జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 16 రోజుల మారథాన్ విచారణ అనంతరం తీర్పును రిజర్వ్ చేసింది.జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన ధర్మాసనం విచారణ ముగింపు రోజైన నేడు (మంగళవారం) సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబాల్, గోపాల్ సుబ్రమణియం, రాజీవ్ ధావన్, జఫర్ షా, దుష్యంత్ దవే తదితరుల రిజాయిండర్ వాదనలను ఆలకించింది.పిటిషనర్లు లేదా ప్రతివాదుల తరపున హాజరయ్యే న్యాయవాదులు ఎవరైనా రాతపూర్వక వాదనలు ఇవ్వాలనుకుంటే రానున్న మూడు రోజుల పాటు కోర్టుకు సమర్పించవచ్చునని ధర్మాసనం సూచించింది. అయితే రాతపూర్వక వాదనలు రెండు పేజీలకు మించి ఉండకూడదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది..16 రోజుల పాటు జరిగిన విచారణలో అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాదులు హరీష్ సాల్వే, రాకేష్ ద్వివేది, వి గిరి తదితరుల వాదనలను సుప్రీం కోర్టు సావధానంగా వింది.జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం 2019 అగస్ట్ 5న రద్దు చేసింది. ఈ రద్దును వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని విచారించేందుకు సీజేఐ నేతృత్వంలో రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. తొలుత ఈ పిటిషన్లపై అనుకూల, ప్రతికూల పార్టీల నుంచి దస్త్రాలు, రాతపూర్వక వివరణలను జులై 27 వరకు స్వీకరించింది. ఆ తర్వాత అగస్ట్ 2వ తేదీ నుండి పూర్తిస్థాయిలో విచారణను ప్రారంభించింది. సోమ, శుక్రవారాలు మినహా మిగతా రోజుల్లో పిటిషన్లపై రోజువారీ విచారణను చేపట్టింది.

## అధికార పార్టీ గూండాల నుంచి మాజీ సైనికుడికి ప్రాణహాని: పవన్ కల్యాణ్

దేశాన్ని శత్రువుల నుంచి కాపాడిన ఓ మాజీ సైనికుడు అధికార పార్టీ గూండాల నుండి ఇప్పుడు ప్రాణహానిని ఎదుర్కొంటున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం రైతులపాలెంకు చెందిన సైనికుడైన ఆదినారాయణపై స్థానిక వైసీపీ సర్పంచ్ సంబంధీకులు దాడి చేస్తే పోలీసులు స్పందించలేదని ఆరోపించారు. హత్యాయత్నానికి సంబంధించిన సెక్షన్లు కాకుండా సాధారణ దాడిగా కేసు నమోదు చేశారని విమర్శించారు. సైనికుడిగా దేశ రక్షణ విధుల్లో భాగస్వామి అయిన ఈ సైనికుడు తన గ్రామంపై బాధ్యతతో ప్రభుత్వ ఆస్తులను కాపాడాలనే ప్రయత్నం చేస్తే అధికార పార్టీ హత్యాయత్నానికి తెగబడటం దురదృష్టకరం అన్నారు. వైసీపీ నాయకులు ప్రభుత్వ భూములను, కాల్వలను కూడా కబ్జా చేస్తున్నారని ఆదినారాయణ... అధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికార పార్టీ వారు ఆయనపై దాడికి పాల్పడ్డారన్నారు. భూకబ్జాదారులు ఎంతకైనా తెగిస్తున్నారన్నారు. ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతుంటే, వారి అనుచరులు కూడా అదే బాటలో పయనిస్తున్నారన్నారు.ఆదినారాయణపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయడంలో పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ సైనికుడికే రాష్ట్రంలో రక్షణ లేకుంటే సామాన్యుడి సంగతి



ఏమిటి? అని ప్రశ్నించారు. గత ఏడాది తిరుపతిలో జనవాణి నిర్వహించిన సమయంలో ప్రసాద్ అనే సైనికుడు తన భూమిని వైసీపీ వాళ్లు కబ్జా చేసి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశాడని గుర్తు చేశారు.

## చంద్రబాబు అండ్ కంపెనీకి తెలిసింది ఇదే!

**- విజయసాయిరెడ్డి**

టీడీపీ అధినేత చంద్రబాబుకు ఐటీ నోటీసుల నేపథ్యంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి తన విమర్శల దాడి పర్వాన్ని కొనసాగిస్తున్నారు. అధికారం ఉంటే ప్రజలకు సేవ చేయడం ద్వారా నాలుగు కాలాల పాటు చరిత్రలో నిలిచిపోవచ్చని రాజకీయాల్లో ఉన్న వాళ్లు ఆశపడతారని, కానీ చంద్రబాబు అండ్ కంపెనీకి మాత్రం అధికారం ఉంటే యథేచ్ఛగా దోచుకోవడమే తెలుసని పేర్కొన్నారు. అక్రమ సంపాదనను కాపాడుకోవాలంటే తప్పనిసరిగా పవర్ చేతిలో ఉండాలి... బాబు ఆలోచన దీని చుట్టే తిరుగుతుందని తెలిపారు. “కేంద్రం వద్ద ఐటీ విభాగం ఉంటే భయపడతానా... ఒక్క రోజులో స్టే తెచ్చుకుంటా... ఎన్ని నోటీసులు ఇస్తారో ఇచ్చుకోండి అని గట్టిగా అరవాలనుకుంటాడు. కానీ వార్నింగ్ లైట్ వెలిగి సైలెంట్ అయిపోతాడు. గోల చేస్తే ఇంకెన్ని అక్రమాలు బయటికి తీస్తారో అనే వణుకు నోటికి తాళం వేసింది. దేశంలోని హవాలా ఆపరేటర్లందరూ చంద్రబాబు కనుసన్నల్లోనే పనిచేస్తారు. వాళ్లెవరైనా డబ్బుతో పట్టుబడితే తనకున్న పలుకుడితో వారిని విడిపిస్తాడు. షాపూర్జీ పల్లోంజీ సంస్థ నుంచి రూ.118 కోట్లు కమీషన్ తీసుకున్నట్టు ఐటీ విభాగం జారీ చేసిన నోటీసులో షెల్ కంపెనీల ప్రతినిధులుగా పేర్కొన్న పేర్లన్నీ హవాలా ఆపరేటర్లవే” అని విజయసాయిరెడ్డి వివరించారు



## అమితాబ్ బచ్చన్‌కు బీసీసీఐ ‘గోల్డెన్ టికెట్’

బాలీవుడ్ నట దిగ్గజం అమితాబ్ బచ్చన్ క్రికెట్ కు వీరాభిమాని అని తెలిసిందే. టీమిండియా ఆడే మ్యాచ్ లు, సిరీస్ లను ఆయన క్రమం తప్పకుండా అనుసరిస్తుంటారు. అంతేకాదు, టీమిండియాను ఎవరైనా తప్పుగా విమర్శిస్తే వారిని ఓ చూపు చూస్తుంటారు. ఈ నేపథ్యంలో, అమితాబ్ బచ్చన్ ను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) విశిష్ట రీతిలో గౌరవించింది. ఆయనకు వరల్డ్ కప్-2023 గోల్డెన్ టికెట్ ను ప్రదానం చేసింది. ఈ గోల్డెన్ టికెట్ ను బీసీసీఐ కార్యదర్శి జై షా... అమితాబ్ కు స్వయంగా అందించారు. దీనిపై బీసీసీఐ ఎక్స్ లో స్పందించింది. “మన గోల్డెన్ ఐకాన్ కు గోల్డెన్ టికెట్ ఇస్తున్నాం. ఈ శతాబ్దపు సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ కు గోల్డెన్ టికెట్ అందించే భాగ్యాన్ని బీసీసీఐ కార్యదర్శి జై షా దక్కించుకున్నారు. లెజెండరీ నటుడు, క్రికెట్ కు వీరాభిమాని అయిన అమితాబ్ బచ్చన్ టీమిండియాకు అందించే అచంచల మద్దతు ఇకపైనా స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఆశిస్తున్నాం. ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్-2023లో అమితాబ్ కూడా పాలుపంచుకుంటుండడం పట్ల ఉద్విగ్నతకు లోనవుతున్నాం” అంటూ బీసీసీఐ తన ప్రకటనలో పేర్కొంది. కాగా, బీసీసీఐ ప్రదానం చేసిన గోల్డెన్ టికెట్ ఒక రకంగా వీఐపీ పాస్ వంటిది. దీని సాయంతో వరల్డ్ కప్ సందర్భంగా ఏ మ్యాచ్ కైనా హాజరై, వీఐపీ గ్యాలరీ నుంచి మ్యాచ్ ను వీక్షించే వీలుంటుంది.



# చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయండి.

**- మాజీ ఎమ్మెల్యే భూమా**

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్05:
ఈనెల ఎనిమిదో తేదీన మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు భవిష్యత్తుకు గ్యారెంటీ – ఇది బాబు గ్యారెంటీ కార్యక్రమానికి నంద్యాల పర్యటనకు వస్తున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, నంద్యాల నియోజకవర్గ ఇన్చార్జ్ భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నంద్యాల పట్టణ, నంద్యాల మండల, గోస్పాడు మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జీలు, టిడిపి నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ నంద్యాలలో శుక్రవారం జరిగే చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని, పట్టణంలోని గాంధీ చౌక్ లో శుక్రవారం సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు బహిరంగ సభ ఉంటుందని, రాత్రి ఆర్కే ఫంక్షన్ హాల్ నందు రాత్రి బస చేసి శనివారం ఉదయం బిసిల సభ, నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కావున చంద్రబాబు పర్యటనకు పెద్ద సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

# హనుమంతు మృతి ప్రజాశక్తి కి తీరని లోటు.

-ప్రజాశక్తి విలేకరి స్వామన్న.



ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు సెప్టెంబర్ 05:
నందికొట్కూరు నియోజకవర్గంలోని పాములపాడు మండలం లింగాల గ్రామానికి చెందిన ప్రజాశక్తి ఆత్మకూరు డివిజన్ ఇంచార్జ్ హనుమంతు మృతి ప్రజాశక్తి పత్రికకు తీరని లోటని నందికొట్కూరు నియోజకవర్గ ప్రజాశక్తి విలేకరి స్వామన్న ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని జైకిసాన్ పార్క్ లో నందికొట్కూరు ప్రజాశక్తి విలేకరి స్వామన్న ఆధ్వర్యంలో ప్రజాశక్తి పత్రిక ఆత్మకూరు డివిజన్ ఇంచార్జ్ హనుమంతు హఠాత్మరణం చెందడంతో ఆయన మృతి సంఘటన తెలిసిన నందికొట్కూరు విలేకరులు ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి విలేకరి స్వామన్న, పల్లెవెలుగు విలేకరి జయరాజ్ లు మాట్లాడుతూ హనుమంతు మృతి పాత్రికేయ కుటుంబానికి తీరని లోటని ఆయన మృతి కి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. ఆయన విలేకరిగా, విద్యార్థి సంఘంలో పని చేసి అనేక సమస్యలపై పోరాడన్నారు. పాములపాడు మండలంలో లింగాల, చెలిమిళ్ల ఎత్తిపోతల పథకాల ఏర్పాటులో ఆయన కృషి చేశారన్నారు. హనుమంతు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు పాత్రికేయులు గోపి, ఖలీల్, చిన్న మారెన్న, స్వామన్న, ఆంజనేయులు, రాజా, ఆనంద్, ఉమ్మర్ బాషా, అబ్దుల్లా, జలీల్, చంద్ర శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవు.

**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 05 :
ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన సక్రమంగా పరిశీలన చేయకుండా బిఎల్ఓ లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలో 10 మంది కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్న గొల్లపేటలోని ఇంటి నెంబర్ 27/282 లో వున్న ఓటర్ల వివరాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ గొల్లపేటలోని ఇంటి నెంబర్ కరెక్షన్ కోసం నిర్ణీత ఫార్మ్ లో వివరాలు ఎందుకు తీసుకోలేదని బిఎల్ఓ ను ప్రశ్నించారు. ఓటర్ల జాబితా సవరణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, డెత్, రిపీటెడ్, డబుల్ ఓటర్లు, నూతన ఓటర్ల నమోదు తదితరాలను నిర్ణీత ఫార్మ్ లలో వివరాలు సేకరించి స్పష్టమైన జాబితాను రూపొందించాలన్నారు. ఒకే ఇంటిలో 10 మంది కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉంటే సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్వోలు ఖచ్చితంగా తనిఖీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలు మేరకు ఇంటింటి పరిశీలనపై ఓటరు జాబితాలో చేర్పులు మార్పులపై నిర్దేశించిన ఫార్మేట్లో సంబంధిత వ్యక్తుల వివరాలు తీసుకుని సక్రమంగా రూపొందించాలన్నారు. ఓటరు జాబితాలో ఏలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వరాదన్నారు. బిఎల్ఓలు తమ పరిధిలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఒక్కరి ఓటును క్షుణ్ణంగా



పరిశీలించాలన్నారు. బిఎల్ఓల పనితీరును ప్రతిరోజు తగు పర్యవేక్షణ చేయాలని ఏఈఆర్ఓను కలెక్టర్ ఆదేశించారు. నంద్యాల ఈఆర్ఓ అనురాధ, ఏఈఆర్ఓ శ్రీనివాసులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# ఏల్కేఆర్ పాఠశాల నందు ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05: నంద్యాల పట్టణములు గల పద్మావతి నగర్ లో ఎల్ కె ఆర్ గోబల్ స్కూల్ నందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల డైరెక్టర్ జే .కళ్యాణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసినారు అనంతరం ఆయన విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయ పాత్ర ఎంతో ఘనసీయమైనదని ఉపాధ్యాయుడు సమాజం సమాజానికి ఆదర్శంగా ఉండాలని అన్నారు ఎన్ని తరాలు మారినా యుగాలు మారినా ఉపాధ్యాయ ఉపాధ్యాయుని విలువ మారదని వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ కూడా మొదట ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చారని ఆ తర్వాత ఎన్నో ఉన్నతమైన పదవులు ఎక్కారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సనత్ కుమార్ మరియు వైస్ ప్రిన్సిపల్ నిర్మల మరియు ఏవో బాబి మరియు ఉపాధ్యాయ



బృందం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.

# చేతి వృత్తుల పని వారికి ఉచితంగా పని ముట్లు పంపిణి.

**-పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్**

**సి. శ్రీనివాస యాదవ్**

ఆంధ్రప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 05:

గ్రామీణ ప్రాంతాలలో సాంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి శ్రీకారం చుట్టిందని నంద్యాల పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీ సి. శ్రీనివాస యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం నాడు జరిగిన విశ్వకర్మ యోజన మీటింగ్ ద్వారా ఈ పథకం అమలుకు సంబంధించి జిల్లా స్థాయి అమలు కమిటీ అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించి అమలు తీరుపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సెప్టెంబర్ 17న ప్రారంభమయ్యే ఈ పథకంపై పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు గ్రామస్థాయి నుంచి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తొలుత ఈ పథకంపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, స్వయం సహాయక సంఘాలు, బ్యాంకర్లకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతోపాటు లబ్ధిదారులు ఆన్లైన్లో



నమోదుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. 18 రకాల వృత్తి, హస్త కళాకారుల్లో లబ్దిదారులను గుర్తించాల్సివుందని, లబ్ధిదారుల నమోదు ప్రక్రియపై వాలంటీర్లకు శిక్షణ నివ్వాలని తెలిపారు. నైపుణ్య కేంద్రాలనూ గుర్తించాల్సిందిగా సూచించారు. ఈ పథకం కింద తొలిదశలో అర్హులైన 18ఏళ్లు నిండిన సాంప్రదాయ కుల చేతి వృత్తిదారులను, కళాకారులను గుర్తించాలన్నారు. లబ్ధిదారుల ఆన్లైన్ లో ఎన్రోల్మెంట్ ను కంప్యూటర్ సర్వీస్ సెంటర్స్ ద్వారా నమోదు చేసుకొన్న అనంతరం వెరిఫికేషన్ చేయాలన్నారు.
వడ్రంగి, పడవల తయారీ, కవచ తయారీ, కమ్మరవాడు కమ్మర, సాధనం పనిముట్టు, తాళాల తయా రీదారులు, శిల్పి, వెండి, బంగారం, మొదలైన లోహాలతో ఆభరణాలు చేయు స్వర్ణ శిల్పి, కుమ్మరి, చెప్పులు కుట్టు వాడు, తాపీ మేస్త్రీ, బుట్ట తయారీ,బొమ్మల తయారి, పూల మాలలు అల్లేవారు, డాభా, దర్జీలు, చేపల వల తయారీ మొదలగు వృత్తుల వారిని గుర్తించాలన్నారు. ఆన్లైన్ దరఖస్తూ చేసుకొనుటకు సమీపములోని గ్రామ సచివాలయము మరియు వార్డు సచివాలయము ను సంప్రదించాలన్నారు. మరింత సమాచారాము కొరకు జిల్లా పరిశ్రమల కేంద్రం, ఇండోర్ స్టేడియం పద్మావతి నగర్, నంద్యాల కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.
ఈ పథకానికి 18 రకాల చేతివృత్తి దారులు అర్హులవుతారన్నారు. అర్హులకు సర్టిఫికేట్, గుర్తింపు కార్డు, రూ.3 లక్షల వరకుహామీ లేని ఋణం, రూ.15 వేల విలువ గల ఉచితంగా పని ముట్లు పంపిణీ చేస్తామన్నారు.

# సమాజంలో మార్పు తీసుకురావాలంటే విద్య తోనే సాధ్యం.

-అంకితభావంతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోండి- -జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్

ఆంధ్ర ప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 05 :
సమాజంలో అనుకూల్యత మార్పులు తీసుకురావాలంటే కేవలం విద్యతోనే సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాలులో డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శాసనమండలి సభ్యులు ఇసాక్ బాషా, మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు హబీబుల్లా, మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, హస్తకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, డీఈవో సుధాకర్ రెడ్డి, డివిఈవో సునీత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ సమాజంలో సమూల మార్పులు తీసుకువచ్చి సానుకూల దృక్పథంతో వ్యవహరించడం విద్యతోనే సాధ్యమవుతుందని... ఈ మేరకు ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉద్బోధించారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి నాడు నేడు కింద పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, జగనన్న అమ్మఒడి, విద్యా కానుక, ఆణిముత్యాలు తదితర కార్యక్రమాలు చేపట్టి ప్రోత్సాహం ఇస్తుందన్నారు. 5-18 సంవత్సరాల్లోపు బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లోనే ఉండాలన్న ప్రధాన ఉద్దేశంతో గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే ప్రభుత్వం సీరియస్ గా చేపట్టిందన్నారు. జిల్లాలో ఇంకా దాదాపు 4000 మంది పిల్లలు బడి ఈడు పిల్లలు బడి బయట ఉన్నారని సంబంధిత విద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి 100 శాతం గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే పూర్తి చేసి బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్చే విధంగా బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. పదవ తరగతి అనంతరం బాలికల్లో ఆ పై చదువులకు వెళ్లేందుకు గ్యాప్ ఏర్పడుతుందని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఓపెన్ స్కూల్లో కూడా అడ్మిషన్లు చేయించేందుకు కృషి చేయాలన్నారు. ఆర్థిక పరిస్థితులు చదువుకు ఆటంకం కాకూడదన్న ప్రధాన ఉద్దేశంతో ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకువచ్చి అనేక సంస్కరణలను ప్రవేశపెట్టిందన్నారు. విద్య అనేది తరగతి గదుల్లో చదవడమే కాదు ప్రవర్తనలో కూడా మార్పులు రావాలన్నారు. మహిళ చదువుకుంటే కుటుంబమంతా విద్యావంతులవుతారన్నారు. ఉత్తమ విద్యతోనే సరైన నాయకున్ని ఓటింగ్ ద్వారా ఎన్నుకోవచ్చున్నారు. విద్యార్థులు అంకితభావంతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ హితబోధ





చేశారు. శాసనమండలి సభ్యులు ఇసాక్ బాషా మాట్లాడుతూ ఏ స్థాయిలో ఉన్నా గురువు లేనిదే ఉన్నత స్థాయి లభించదన్నారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పేదరికంలో ఉంటూ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి అనేక ఉన్నత పదవులు అలంకరించడంతో పాటు విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి తన జన్మదినాన్ని గురుపూజోత్సవ దినోత్సవంగా మార్చారన్నారు. నాడు నేడు కింద ఉపాధ్యాయులకు విద్యతో పాటు మరిన్ని బాధ్యతలు పెరిగాయన్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించడంతోపాటు ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. మైనారిటీ సంక్షేమ అభివృద్ధి సలహాదారు





హబీబుల్లా మాట్లాడుతూ మనిషి సరైన మార్గంలో నడిచి మంచి ప్రవర్తనతో మెలగాలంటే విద్య అత్యంత ఆవశ్యకరమన్నారు. ఎంత పెద్ద స్థాయిలో ఉన్న వ్యక్తికైనా ఉపాధ్యాయులే వెనుక ఉంటారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా పిల్లలను బాగా చదివించి మంచి భవిష్యత్తు ఇవ్వాలని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ఆయన కోరారు. మార్క్ ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయులకు ఎనలేని గౌరవం ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైద్య, విద్యా రంగాలకుఅత్యంత ప్రాధాన్యతనిచ్చి అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. అనంతరం గుర్తించి ఎంపిక చేసిన 52 మంది ఉత్తమ ఉపాధ్యాయులను అతిథులు ఘనంగా సన్మానించారు

# మట్టి మిద్దె కూలి ఒకరు మృతి,ఒకరు పరిస్థితి విషమం.

-ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలం -మృతి చెందిన కుటుంబానికి 10 లక్షల పరిహారం ఇవ్వాలి.

-సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్.







ఆంధ్ర ప్రగతి పాణ్యం సెప్టెంబర్ 05:
పాణ్యం మండలం కౌలూరు గ్రామంలో భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ హెచ్చరించినగత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో రెవెన్యూ అధికారులు సమీపంలోని గ్రామాలలోని ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంది. కానీ అటువంటి చర్యలు ఏమి మండలంలో తీసుకున్న దాఖలాలు లేవు. ముఖ్యంగా ఎక్కువ రోజులు వర్షాలు పడితే పాతకాలం నాటి మట్టి మిద్దెలు కూలుతాయని తెలిసిన, గ్రామంలో రెవెన్యూ అధికారులు దండోరా ద్వారా ప్రజలకు తెలియజేయాల్సి ఉంది.కానీ గ్రామాలలో ప్రజలను దండోరా ద్వారా అప్రమత్తం చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారుఈ కారణంగా మండలంలోని కౌలూరు గ్రామంలో మట్టి మిద్దె కూలి వనం నాగమ్మ (85 సంవత్సరాలు) మృతి చెందగా, తీవ్ర గాయాలు అయినా శివనాగమ్మ (75 సంవత్సరాలు) పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స నిమిత్తం శివ నాగమ్మను శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. కేవలం అధికారుల నిర్లక్ష్యమే ఈ సంఘటనకు కారణమని నంద్యాల జిల్లా సిపిఐ కార్యదర్శి రంగనాయుడు అన్నారు.గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రభుత్వం ఒకపక్క ప్రజలను అప్రమత్తం చేయాలని చెబుతున్నా, ప్రభుత్వ ఆదేశాలను రెవెన్యూ అధికారులు పాటించకపోవడం చాలా దురదృష్టకరం. అందుకు కారణమైన రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది.

# నాడు నేడు క్రింద చేపట్టిన పనులకు ఎక్స్పెండిచర్ బుక్ చేయండి.

-పెండింగ్ లో ఉన్న గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వేను పూర్తి చేయండి

-అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్




ఆంధ్రప్రగతి నంద్యాల, సెప్టెంబర్ 05:
రెండవ విడత మన బడి నాడు నేడు పథకం కింద పెండింగ్లో ఉన్న పనులు ఈనెలాఖరులో పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీర్లు, ఎంఈఓలను జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎక్స్పెండిచర్ బుకింగ్, గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే పై మండలాల వారిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఈవో సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ రెండవ విడత నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో పనులు చేపట్టి పెండింగ్లో ఉన్న అరకొర పనులను ఈ నెలాఖరులోగా పూర్తి పూర్తిచేయాలని ఎంఈఓ, సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. ప్రతి మండలంలో ఖచ్చితంగా 4 పాఠశాలల్లో అన్ని పనులు పూర్తిస్థాయిలో పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.
పూర్తయిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపు నిమిత్తం ఎక్స్పెండిచర్ బుక్ చేయాలన్నారు. ఇందుకు సంబంధించి 4 కోట్ల రూపాయలు అకౌంట్లో ఉందని... నిల్వ వున్న నిధులు ఖర్చు చేసేందుకు బిల్లులను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే బడి ఈడు పిల్లల నమోదుకు సంబంధించి పెండింగ్లో ఉన్న 2700 మంది పిల్లల వివరాల సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం.

ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05:
నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళ వారం స్థానిక శారద విద్యాపీఠం పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు పి.వి.సుధాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన 6 మంది ఉపాధ్యాయులకు లయన్స్ క్లబ్ ఉపాధ్యాయ దినోత్సవ పురస్కారాలను శాలువా, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సర్వేపల్లి రాధాకృష్ణ పటానికి పూల మాల తో నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు డాక్టర్ గెలిచి సహదేవుడు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ , లయన్స్ క్లబ్ కార్యదర్శి సోమశుల నాగ రాజు, శారద విద్యా పీఠం ప్రధాన ఉపాధ్యాయులు నారాయణ పాల్గొన్నారు. డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత విశేషాలను,ఉపాధ్యాయ వృత్తి గొప్పతనాన్ని వివరించారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలో ఉన్నదని,విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దితే దేశ భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుంది అన్నారు..లయన్స్ క్లబ్ ఉపాధ్యాయ దినోత్సవ పురస్కార గ్రహీతలు:విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు జెడ్ ఎస్ పి. దివాకర్, యస్ పి జి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు జీవ లత, కొరటమద్ది ఎమ. పి. యు. పి పాఠశాల ఉపాధ్యాయులు యోగీశ్వరులు, ఈర్ణపడు జెడ్ పి పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు నరేంద్ర, శారద విద్యా పీఠం ఉపాధ్యాయులు లక్ష్మి నాగమణి, వెంకట రమణ. పురస్కార్ గ్రహీతలు లయన్స్ క్లబ్ కు ధన్యవాదాలు తెలియజేశారు. తాము మరింత మెరుగైన ఉపాధ్యాయ సేవలు అందించడానికి ఈ పురస్కారం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లయన్స్ క్లబ్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి సౌజన్యంతో నిర్వహించారు. సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మేడా చంద్రశేఖర్,పాఠశాల కమిటీ సభ్యులు నాగరాజు,విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.విద్యార్థులు ఆలపించిన ప్రార్థన, దేశభక్తి గీతాలు ఆకట్టుకున్నాయి




# శ్రీశైల దేవస్థానం ఈ ఓ లవన్న బదిలీ, నూతన ఈవోగా పెద్దిరాజు.



ఆంధ్ర ప్రగతి శ్రీశైలం సెప్టెంబర్ 05 : జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహా క్షేత్రం ఆలయ కార్య నిర్వహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న లవన్న ను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 35 మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీశైల దేవస్థానం నూతన ఈవోగా డి. పెద్దిరాజును ప్రభుత్వం నియమించింది.

# చంద్రబాబు నంద్యాల పర్యటనను విజయవంతం చేయండి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05:
"బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ నినాదంతో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నంద్యాలకు విచ్చేస్తున్న నేపథ్యంలో వారి పర్యటనను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీలో పొలిట్ బ్యూరో సభ్యుల ఎన్ఎండి ఫారూఖ్ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్. ప్రధాన కార్యదర్శి ఎన్ ఎండి.ఫిరోజ్ విత్తనాభివృద్ధి శాఖ మాజీ ఛైర్మన్ ఏ వి. సుబ్బారెడ్డి న్యాయవాది తులసి రెడ్డి పిలుపునిచ్చారు.అనంతరం పొలిట్ బ్యూరో సభ్యులు ఎన్.ఎమ్.డి ఫరూక్పర్యటన వివరాలు మీడియాకు తెలియజేస్తూ 8వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు గాంధీ చౌక్ లో బహిరంగ సభ ఉంటుందని అదేక్రమంలో 9వ తేదీ ఉదయం 10.గంటలకు పట్టణంలోని ఆర్ కెఫంక్షన్ హాల్ నందు ముస్లిం సోదరులతో ఆత్మీయ సమావేశం మరియు కార్యకర్తల సమావేశం తరువాత పర్యటన ముగుస్తుందని పేర్కొన్నారు.

# హనుమంతు మృతికి సిపిఎం సంతాపం.



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05:
ఆత్మకూరు డివిజన్ ప్రజాశక్తి సీనియర్ రిపోర్టర్ గా, సిపిఎం పార్టీ నాయకునిగా పనిచేసి చిన్న వయసులోనే అకాల మరణం చెందిన హనుమంతు మృతికి సిపిఎం పార్టీ జిల్లా కమిటీ తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ హనుమంతు పాములపాడు మండలం లింగాల గ్రామంలో సిపిఎం పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా ఉంటూ ప్రజల పక్షాన వ్యక్తిగా ప్రజల అభిమానం చురగొన్న నాయకుడన్నారు.పాములపాడు మండల కమిటి సభ్యుడుగా ఉంటూ సిపియం పార్టీ మండల కార్యాలయ నిర్మాణానికి పూర్తి సహాయ సహాకారాలు అందించాడన్నారు.పార్టీ నాయకుకుడిగా ఉంటూ ప్రజాశక్తి విలేకరిగా ను అనంతరం ప్రజాశక్తి ఆత్మకూరు డివిజన్ ఇంచార్జీ గా పని చేస్తూ గుండె పోటుతో హఠత్తు మరణం పొందడం బాధాకరమన్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# చంద్రబాబు కళ్యాణదుర్గం పర్యటనకు భారీ ఏర్పాట్లపై సమావేశం.



ఆంధ్రప్రగతి నంద్యాల సెప్టెంబర్05:
తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు 5,6,7 తేదీలలో అనంతపురం జిల్లా రాయదుర్గం, కళ్యాణ దుర్గం, ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గం లలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పర్యటనకు వస్తున్న నేపథ్యంలో భారీ ఏర్పాట్లు జన సమీకరణకై పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా (ఏ వి ఆర్ ప్రసాద్,నంద్యాల,టిడిపి రాష్ట్ర కార్యదర్శి, ప్రొద్దుటూరు అసెంబ్లీ టిడిపిపరిశీలకులు )మంగళవారం కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం కొందుర్పి మండలం పరిశీలకునిగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని జన సమీకరణకు ముఖ్య నాయకులు కార్యకర్తలతో సమాలోచనలు దిశా నిర్దేశం నిర్ణయించడం జరిగింది.

# గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన బాల అకాడమీ హై స్కూల్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05:

బాల అకాడమీ రవీంద్ర హై స్కూల్ నందు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాల కరస్పాండెంట్ ఎం.జి.వి.రవీంద్రనాథ్ ప్రిన్సిపల్ మాధవీలత పాల్గొన్నారు.సర్వేపల్లి రాధాకృష్ణన్ పటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూగురువు త్రిమూర్తి స్వరూపుడు. బ్రహ్మలా ఞనాన్ని మనలో పుట్టించి, విష్ణువులా రక్షించి, శివుడిలా ఞ్ఞనాన్ని తుంచి మంచి చెడులను విశదీకరించి, మానవతా విలువలు, సద్గుణ సంపన్నతలు ఎలాపొందాలో నేర్పుతాడు. మనసు నుంచి ఆలోచనలు ఆవిర్భవిస్తాయి. సర్వవ్యాపకమైన మనసు విష్ణు స్వరూపం. విష్ణుమూర్తి నాభి నుంచి ఉద్భవించిన బ్రహ్మ మాదిరిగానే వాక్కు కూడా మనసు నుంచి ఆవిర్భవిస్తుంది. బ్రహ్మయే వాక్కు...ఈశ్వరుడే హృదయం. ఇలా మన వాక్కు, మనసు, హృదయం త్రిమూర్త్యాత్మకమై ఉంటాయి. త్రిమూర్తులు మనలోని త్రిగుణాలకూ ప్రతీకలు. గురువు మనలో మంచిని సృష్టించి, లోకంలో ఎలా జీవించాలో నేర్పుతాడు. అమాయకత్వాన్నీ, మోహాన్నీ తుంచివేసే శక్తి సంపన్నుడు. 'గు కారో అంధకారస్య , రు కారో తన్నిరోధకః' అంటే గు అంటే చీకటి. రు పారద్రోలేవాడు. గురువు ఞ్ఞనం అనే చీకటిని పారద్రోల్ఞిన జ్యోతిని వెలిగించేవాడు. అంతేకాదు గురువు గుణాతీతుడు, రూపరహితుడు, భగవత్సమానుడు.భుక్తి విద్యలు కాక ముక్తి విద్యలను బోధించే గురు దర్శనానికి , స్మరణనకు ఈ రోజు విశిష్ట ప్రాముఖ్యత ఉంది. చంద్రుడు మనసునూ, సూర్యుడు బుద్ధిని ప్రకాశింపజేస్తారు. మానవుల మనసులో అష్టమదాలూ,అరిషడ్వర్గాలూ, అహంకార చిత్తం అనే పదహారు మలినాలు పూర్ణిమ నాడు గురు నామస్మరణతో తొలగిపోతాయి.

గురువు ఒక శిల్పి లాంటి వాడు. బండరాళ్లపై అందమైన శిల్పాలు చెక్కి వాటికి ప్రాముఖ్యతను కలిగించగల ఞ్ఞశాలి గురువు. ఓ మంచి గురువు మలచిన శిష్యులు సంస్కారవంతులై ,సమాజానికి ఉపయోగపడతారు. అలా గురువు సమాజ సేవచేస్తున్నాడు.స్వర్ణకారుడు బంగారాన్ని సానబట్టి తయారు చేసిన ఆభరణం ధరించేవారికి అందాన్ని ఇస్తుంది. అలాగే గురువు కూడా శిష్యులను సానబట్టి సద్గుణాలు నేర్పి పరిపూర్ణ మానవుడిగా మార్చి సమాజానికి అలంకారంగా అందిస్తున్నాడు. తోటమాలి నేలను చక్కగా చదునుచేసి మొక్కలు నాటి ఎరువువేసి పెంచి పోషించి అందరికీ ఉపయుక్తమైన ఫలాలనూ, పుష్పాలనూ ఎలా అందిస్తాడో గురువు కూడా శిష్యులను సమాజానికి అలంకారాలుగా అందిస్తాడు. గురువు మార్గదర్శకుడు ,తన శిష్యులు ఏది ఎలా చేయాలో, ఎంత వరకు చేయాలో, ఏది మంచి, ఏది చెడు అని నిర్ణయించగలడు.

గురువు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు. ఆయనే ఆ పరబ్రహ్మము. అజ్ఞానమనే అంధకారాన్ని జ్ఞానమనే అంజనముతో తొలగించే వారు గురువులు. అనంతమైన, అఖండమైన, సృష్టిలోని కదిలే, కదలని ప్రతి ప్రాణి/వస్తువు లో ఉండే బ్రహ్మ యొక్క నిజాన్ని తెలిపే వారు గురువులు. సృష్టిలో, కదిలే కదలని ప్రతి వస్తువులో ఉండే జీవాత్మ నిజాన్ని తెలిపే వారు గురువులు. చరాచారాలతో కూడిన మూడులోకాలను వ్యాపించి ఉన్న శుద్ధ చైతన్య స్వరూపమైన బ్రహ్మ గురించి తెలిపే అసి శబ్దాన్ని వివరించే వారు గురువు.



# ఇస్కాన్ లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు.

ఆంధ్రప్రగతి రుద్రవరంసెప్టెంబరు05:
ఈనెల 7వ తేదీన ఇస్కాన్ అహోబిలం, హరి నగరం సమీపంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అహోబిలం ఇంచార్జ్ చంద్రకేశవ దాస్ తెలిపారు. మంగళవారం స్థానిక ఇస్కాన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 7వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు దర్శన హారతి సాయంత్రం నాలుగు గంటలకు ఉట్లోత్సవం(అన్ని గ్రామాల నుండి యువకులు గ్రూపులుగా ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు) సాయంత్రం 6 గంటలకు హారతి భజన విందు భోజనము, 6,30 నిమిషాలకు ముఖ్య అతిధులచే శ్రీ కృష్ణాష్టమి సందేశం. 7 గంటలకు బహుమతుల ప్రధానం, రాత్రి 7 గంటలకు ఆంధ్ర గాన కోకిల ఏవి, సుబ్బారావు కుమారుడు ఏ, వెంకటేశ్వరరావు సమర్పించు శ్రీకృష్ణ రాయబారం నాటకం కలదు అన్నారు. రాత్రి 11 గంటలకు శ్రీ రాధా గోవిందులకు మహా శంకరాభిషేకం, 11:30 నిమిషాలకు మహా హారతి 108 రకాల మహా నివేదన, 12 గంటలకు జన్మాష్టమి మహా ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. 8 తేదీ ఉదయం 11 గంటలకు శ్రీ ల ప్రభు పాదా అభిషేకం, వ్యాస పూజ మరియు ప్రవచనం, మధ్యాహ్నం విందు భోజన వసతులు కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని ప్రతి ఒక్కరు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా ఈకార్యక్రమంలో పాల్గొనే 10,వేల మందికి భోజనం వసతి కల్పించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల నందు ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 05:
పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ %డ% పీజీ కళాశాల నందు మంగళవారం నాడు ఉపాధ్యాయుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణ రెడ్డి , మరియు కళాశాల డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్రక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణ రెడ్డి, ఉపాధ్యాయుని – ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు హాజరయ్యారు. మొదటిగా కార్యక్రమం ప్రార్థన తో మొదలు పెట్టి, ఉపాధ్యాయుని – ఉపాధ్యాయులు అందరూ కలిసి డా౹౹ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్ర పటానికి పూలమాలను సమర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తమదైన శైలిలో ప్రసంగిస్తూ ఉపాధ్యాయుల అందరికీ శుభాకాంక్షలు తెలియచేశారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, ఉపాధ్యాయుల దినోత్సవం యొక్క గొప్పతనాన్ని తెలుపుతూ గొప్ప పండితుడు, భారతరత్న, తొలి ఉప రాష్ట్రపతి అయిన డా౹౹ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజునే టీచర్స్ డే గా భారతీయులందరూ జరుపుకుంటారు అని విద్యార్థులకి తెలిపారు.

కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి. రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయులందరికీ ఉపధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అజ్ఞానమనే చీకటిలో ఉన్న వారిని విజ్ఞానమనే మార్గంలో నడిపించే ఏకైక వ్యక్తి గురువు. ఏ దానం చేసినా కరిగిపోతుంది కానీ విద్యా దానం చేస్తే అది చచ్చిపోయేంత వరకు వారితోనే ఉంటుంది. అలాంటి గొప్ప దానాన్ని చేసే ఉపాధ్యాయులకి ఈరోజు మనం సత్కరించుకోవడం అనేది గొప్ప విశేషం అని తెలిపారు. జీవితంలో స్థిరపడడానికి, జీవితాన్ని గొప్పగా కొనసాగించడానికి విలువైన పాఠాలు నేర్పించడంలో గురువుల తర్వాతే ఎవరైనా. గురువులను ఉద్దేశిస్తూ విద్యార్థుల పట్ల అంకితభావంతో ఉండి బాధ్యత – యుతంగా మంచి పద్ధతులు నేర్పించాలని తెలిపారు. ఉపాధ్యాయుడైన తన జీవితంలో ఎప్పటికీ ఒక విద్యార్థి అని మర్చిపోకుండా ప్రతిరోజు కొత్త విషయాల్ని నేర్చుకుంటూ ఆ కొత్త విషయాలను విద్యార్థులతో పంచుకోవాలని తెలుపుతూ, సమాజానికి ఒక ఉపాధ్యాయుడి యొక్క గొప్పతనాన్ని చెబుతూ వాళ్ల సమాజ బాధ్యతను నిర్వహించాలి అని తెలిపారు. ఉపాధ్యాయులందరూ డా౹౹ సర్వేపల్లి రాధాకృష్ణని ఆదర్శంగా తీసుకొని అలానే పనిచేయాలని పేర్కొన్నారు.

ప్రతీ ఉపాధ్యాయుడు ఒక సమాజ శిల్పి అని అలాంటి వారిని సత్కరించడం మన ఒక్కరి భాధ్యత అని కళాశాలలోని వారి సేవలను ప్రశంసిస్తూ వెంకట్రావు , రత్నారెడ్డి , ఇంతియాజ్ అహ్మద్, రాంప్రసాద్, మోహన్ రావ్, సి.నాగరాజు, ఏస్. మజీద్ , ఎం. శ్రావణి కుమారి, ఎం. రత్నరామి రెడ్డి, ఎం. రామేశ్వరుడు అధ్యాపకులకు ద్రోణాచార్య అవార్డు తో ఘనంగా సన్మానించారు

ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఉపాద్యులందరుకి ఆటలు నిర్వహించడం జరిగింది. గెలుపొందిన ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి. రామకృష్ణ రెడ్డి చేతుల మీదుగా జ్ఞాపికలు అందుకోవడం జరిగింది. చివరికి ఈ కార్యక్రమం జాతీయ గేయ ఆలపనతో ముగిసింది.

# రూ.50 కోట్ల తో సిరివెళ్ల యూనియన్ బ్యాంక్ బిజినెస్ టర్నోవర్ .



ఆంధ్రప్రగతి సిరివెళ్ల సెప్టెంబర్05:

మండల పరిధిలోని కర్నూలు కడప జాతీయ రహదారి సమీపంలో సిరివెళ్ల మెట్ట సమీపంలో యూనియన్ బ్యాంక్ రూ.50 కోట్ల టన్నోవ ర్ బిజినేష్ కావడం జరిగిందనిబ్యాంకు మేనేజర్ అనూష తెలిపారు.ఈ సందర్భంగా బ్యాంకు వినియోగదారుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో సుబ్రమణ్యంపాల్గొని అధ్యక్షత వహించారు.అనంత రం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతూ బ్యాంకు ద్వారా వినియోగదారులందరికీ సేవలు అందించడం జరుగు తుందిని అన్నారు. అప్పుడే బ్యాంకు అభివృద్ధి బాటలో పయని స్తుందని తెలియ జేశారు.అనంతరం బ్యాంకు వినియోగదారులు కోటపాడు దూదేకుల గురప్ప మాట్లాడుతూ బ్యాంకు సేవలను గుర్తించి బ్యాంకు అభివృద్ధికి పాటుపడాలని కోరారు. బ్యాంకు ద్వారా వినియోగదారులకు అన్ని రకాల పథకాలతో పాటు బ్యాంకు సేవలను అందించడం జరుగుతుంది అని బ్యాంకు మేనేజర్ అనూష తెలిపారు. బిజినెస్ సేకరణతో పాటు వినియోగదారులకు గోల్డ్ లోను, పంట రుణాలు, పర్సనల్ లోను, వెహికల్ లోను వ్యాపారస్తులకు లోన్లు తదితర లోను సౌకర్యం కల్పించడం జరుగుతుందిని అన్నారు. వినియోగదారులు తీసుకున్న లోన్లను సకాలంలో చెల్లించి న వారికి యధాప్రకారం తిరిగి లోన్లను వినియోగదారులకు ఇవ్వడం జరుగుతుందిని బ్యాంకు మేనేజర్ అనూష తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పద్మజ, క్యాషియర్ రమేష్ ఈశ్వరయ్య సిబ్బంది, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

# రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలుపుటకు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కు వినతిపత్రం అందజేత.

రేగోడ్) అందోల్ ఎమ్మెల్యే .చంటి క్రాంతి కిరణ్ కు రేగోడ్ మండల బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ లు,ఎంపీటీసీ లు,గ్రామ అధ్యక్షులు,సీనియర్ నాయకులు,యువకులు కలిసి రేగోడ్ మండలాన్ని సంగారెడ్డి జిల్లాలో కలపాలని వినతిపత్రం సమర్పించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రేగోడ్ మండలాన్ని సంగారెడ్డిలో కలిపేందుకు ఇదివరకే ప్రణాళిక సిద్ధం చేసి మంత్రి హరీష్ ద్వారా మన సీఎం కేసీఆర్ కు విన్నవించడం జరిగిందని తెలిపారు

.ఈకార్యక్రమంలో రేగోడ్ మండల బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సుంకే రమేష్, మాజీ మండల అధ్యక్షులు వినోద్ కుమార్,సర్పంచ్ ఫోరం అధ్యక్షులు యం.రవీందర్,పిఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్,సర్పంచ్ బాదాన్ పల్లి నర్సింలు,ఎంపిటిసి గొల్ల నర్సింలు,ఏయంసి డైరెక్టర్ సవాద్ భూంరెడ్డి,సర్ధార్ పటేల్,సర్పంచ్ సిద్దారెడ్డి,తుకారం నాయక్,గ్రామ అధ్యక్షులు రాచోటి సుభాష్,నర్సింగ్ రావు,బండారు రాములు,జుర్రురమేష్,సీనియర్ నాయకులు పండల్ రెడ్డి,జంగం కుమార్ స్వామి,రైబస అధ్యక్షులు నాగయ్య స్వామి,కిషన్ నాయక్,కిష్టయ్య,చెంద్ర నాయక్,పుల్య నాయకు తదితరులు పాల్గొన్నారు.



# మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే




,కంగ్టి) మండల్ లో మంగళవారం, సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరయ్యారు అనంతరం, ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండలాల్లో ఆయా సమస్యలు ఆయా డిపార్ట్మెంట్ పనితీరులను, అధికారులను నాయకులను అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో, ఎంపీపీ, సంగీత వెంకట్ రెడ్డి, జెడ్పిటిసి లలిత ఆంజనేయులు, ఎంపీడీవో ముజ్జు ఫరోద్దీన్, తాసిల్దార్ విష్ణు సాగర్, నాయకులు, నేతలు, తదితరులు పాల్గొన్నారు.